ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

శుక్రవారం 23 ఆగస్టు 2024



ఇకపై ప్రజాసేవే లక్ష్యం

- ఇది కేవలం పార్టీ జెండా మాత్రమే కాదు భావితరాల విజయానికి ప్రతీక
- 'తమిళగ వెట్రి కళగం' అధినేత విజయ్
- పార్టీ పతాకం, పాట ఆవిష్కరణ



పార్టీ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న విజయ్

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): 'ఇప్పటి వరకూ మనకోసం మనం కష్టపడ్డాం. ఇకపై రాష్ట్ర ప్రజల కోసం కూడా పాటుపడదాం' అంటూ ప్రముఖ సినీ నటుడు, 'తమిళగ వెట్రి కళగం' పార్టీ అధినేత విజయ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం ఉదయం ఈసీఆర్ పనయూరులో వున్న పార్టీ కార్యాలయంలో పార్టీ పతాకాన్ని, పాటను ఆవిష్కరించిన విజయ్.. నేతలనుద్దేశించి ప్రసంగించారు. పార్టీ నేతలు, కార్యకర్తలంతా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సంతోషకరమైన రోజు ఈ పతాకావిష్కరణ అని అన్నారు. ఫిబ్రవరిలో పార్టీని ప్రారంభించిన తాను.. ఇప్పటికే రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించినట్లేనన్నారు. తన హృదయంలో చెరగని ముద్రవేసుకుని వేసుకున్న అభిమానులు, నేతలు, కార్యకర్తల ముందే పార్టీ పతాకాన్ని ఆవిష్కరించడం సంతోషంగా వుందన్నారు. ఈ పార్టీ పతాకం రూపొందడం వెనుక ఎంతో చరిత్ర వుందని, దాని గురించి మరో రోజు ప్రకటిస్తానన్నారు. ఇప్పుడు ఆవిష్కరించింది కేవలం పార్టీ పతాకం మాత్రమే కాదని, తమిళనాడు భావి తరాలకు అందించే విజయమని వ్యాఖ్యానించారు. ఈ పతాకం ఇంటింటా ఎగరాలని, తద్వారా అందరికీ మంచే జరుగుతుందని విజయ్ పేర్కొన్నారు.



పార్టీ నేతలతో కలిసి ఆవిష్కరణను తిలకిస్తున్న విజయ్ తల్లిదండ్రులు

కొద్దిమంది నడుమ.. సాదాసీదాగా..

యువతలో ఎంతో క్రేజ్ వున్న హీరో విజయ్.. పార్టీ పతాకావిష్కరణ ఘనంగా నిర్వహిస్తారంటూ భావించిన రాజకీయ వర్గాల అంచనాలకు భిన్నంగా సాదాసీదాగా, కొద్దిమంది మధ్యలో ఈ కార్యక్రమం ముగిసింది. ఫిబ్రవరిలో పార్టీని స్థాపించిన విజయ్.. 2 కోట్ల మంది సభ్యుల్ని చేర్పడమే లక్ష్యంగా కృషి చేస్తున్న విషయం తెలిసిందే. అంతేగాక సెప్టెంబరు 22వ తేదీన విల్లుపురం జిల్లా విక్రవాండిలో తొలి మహానాడును ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం పార్టీ పతాకాన్ని, పాటను పనయూరులోని పార్టీ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు విజయ్ లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి 300 మందికి మాత్రమే ఆహ్వానం అందింది. విజయ్ తల్లిదండ్రులైన శోభ, ఎస్ఏ చంద్రశేఖర్ కూడా ఉదయం 8.45 గంటలకే పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. విజయం పార్టీ స్థాపించిన తరువాత వారు ఆ కార్యాలయానికి రావడం ఇదే ప్రథమం. వారికి పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ స్వాగతం పలికారు. నీలాంగరైలో వున్న తన నివాసం నుంచి 8.55 గంటలకు బయలుదేరిన విజయ్.. 9.20 గంటలకు పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. తెల్ల చొక్కా, చందనం రంగు ప్యాంట్ ధరించిన విజయ్.. కార్యాలయంలోకి రాగానే తన తల్లిదండ్రులకు, పార్టీ నిర్వాహకులకు నమస్కరిస్తూ కూర్చున్నారు. బుస్సీ ఆనంద్ స్వాగతోపన్యాసం అనంతరం. వేదిక ఎక్కిన విజయ్.. పార్టీ నేతల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పతాకాన్ని ఆవిష్కరించారు. వేదిక వెనుకవైపున్న తెరపై పార్టీ పాట వీడియో ప్రదర్శించారు. అనంతరం విజయ్ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి భారీగా విజయ్ అభిమానులు తరలివచ్చారు. వారంతా పార్టీ కార్యాలయం వెలుపలే ఉండడంతో ఆ ప్రాంతం సందడిగా మారింది.

విభిన్నంగా పతాకం

కింద,పైనా ఎరుపు, మధ్యలో పసుపు రంగు.. పసుపు రంగు మధ్యన రెండు ఏనుగులు ఘీంకరిస్తుండగా, వాటి నడుమ వాగైపుష్పం (దొరిసేన పుష్పం).. చుట్టూ 23 నక్షత్రాలతో పతాకం రూపొందింది.

గుంకీలతో..

విజయ్ ఆవిష్కరించిన తమిళగ వెట్రి కళగం పార్టీ పాట ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో తెగ వైరల్ అవుతోంది. నేపథ్యంలో యుద్ధ సన్నివేశాలతో కూడిన 4.30 నిముషాల నిడివిగల ఈ పాట.. అందరినీ ఆకట్టుకుంటోంది. యజమానులను కూర్చోబెట్టుకున్న కొన్ని మదపుటేనుగులు ప్రజల్ని తొక్కివేస్తుండగా, రెండు గుంకీ ఏనుగులు వాటిని హతమార్చి, ప్రజల్ని రక్షించేలా దృశ్యాలను చిత్రీకరించారు. అలాగే విజయ్ మిగిలిన పార్టీలను అణచివేసి ప్రజల్ని సంరక్షిస్తాడనే భావం వచ్చేలా రూపొందించారు.

వాగై పుష్పం ప్రత్యేకతలెన్నో...

విజయ్ పార్టీ పతాకంలో ఉన్న దొరిసేన పుష్పం ఎన్నో ప్రత్యేకతలు కలిగి వుంది. సంగకాలంలో యుద్ధంలో విజయం సాధించిన రాజులు.. తమ గెలుపు చిహ్నంగా ఈ పుష్పాన్ని ధరించి సంబరాలు జరుపుకునేవారని చరిత్ర చెబుతోంది. యుద్ధంలో గెలిచిన పురుషులు తమ విజయానికి ప్రతీకగా ఈ పుష్పాన్ని మెడలో వేసుకునేవారని, అదే మహిళలైతే చెవిదుద్దులుగా ధరించేవారు. ఈ పుష్పం దక్షిణాసియాలో లభిస్తుంది. తమిళనాడులో ఇది బహు అరుదు. ఎడారుల్లో పెరిగే మొక్క ఇది. మంచి వాసన కలిగిన ఈ పుష్పం లేత పసుపు, తెలుపు రంగులో ముద్దగా ఉంటుంది.

మంత్రివర్గంలో మార్పులు ?!

నేడో రేపోనంటూ విస్తృత ప్రచారం ● నాకేమీ సమాచారం లేదే? : సీఎం స్టాలిన్

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల కోసం ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 27వ తేదీన విదేశాలకు వెళ్లనున్న నేపథ్యంలో.. ఆయన తనయుడు, రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధికి ఉపముఖ్యమంత్రి పదవితో పాటు ముగ్గురు సీనియర్ మంత్రులపై వేటు, మరో మూడు కొత్తవారికి చోటు లభించనుందంటూ గత కొంతకాలంగా జరుగుతున్న ప్రచారం గురువారం తారస్థాయికి చేరుకుంది. గురువారం సాయంత్రమే మంత్రి వర్గంలో మార్పులుచేర్పులు జరుగనున్నాయని, రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఏర్పాట్లు కూడా సిద్ధమయ్యాయంటూ సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్‌చల్ చేశాయి. దీంతో అధికార పార్టీలో ఒక్కసారిగా ఉత్కంఠ నెలకొంది. ఇంత హఠాత్తుగా సీఎం నిర్ణయం తీసుకోవడమేంటంటూ విశ్లేషణలూ మొదలయ్యాయి. నిజానికి ఉదయనిధికి ఉపముఖ్యమంత్రి పదవిపై డీఎంకే దోబూచులాడుతోంది. ఆయనకు ఉపముఖ్యమంత్రి పదవి రాబోతోందంటూ లీకులు ఇవ్వడంతో పాటు .. వార్తలు వెలువడ్డాక ఖండనలూ చేస్తోంది. ఉదయనిధికి డిప్యూటీ సీఎం పదవి ఇవ్వనున్నట్లు జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని సాక్షాత్తు ముఖ్యమంత్రే చెప్పాక కూడా డీఎంకే కార్యదర్శి ఆర్ఎస్ భారతి.. 'సీఎం అనుకుంటే అదెంత పని' అంటూ ఇటీవల మళ్లీ ఊహాజనిత కథనాలకు ప్రాణం పోశారు. మరో మూడు రోజుల్లో సీఎం విదేశీ పర్యటనకు వెళ్లనుండడంతో గురువారం సాయంత్రంగానీ, లేదా శుక్రవారం గానీ మంత్రివర్గంలో మార్పులు జరుగవచ్చంటూ విస్తృతంగా ప్రచారం జరిగింది. దీంతో మీడియా ప్రతినిధులు రాజ్‌భవన్ వివరణ కోసం పరుగులుపెట్టాల్సివచ్చింది. అయితే గురువారం మధ్యాహ్నం మెరీనాలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మీడియా ప్రతినిధులు దీని గురించి అడగ్గా.. 'ఈ వ్యవహారం గురించి నాకెలాంటి సమాచారం లేదు' అంటూ ముభావంగా సమాధానం ఇచ్చారు. దీంతో అసలేం జరుగుతుందో తెలియక రాజకీయవర్గాలు సైతం తలలు పట్టుకుంటున్నాయి.



విద్యార్థినికి ప్రోత్సాహక నిధి అందజేస్తున్న సీఎం స్టాలిన్. చిత్రంలో మంత్రి పొన్ముడి, సీఎస్ మురుగానందం తదితరులు

పరిశోధకులకు ప్రోత్సాహం

120 మందికి నెలకు రూ.25 వేలు ● 'సీఎం పరిశోధనా పథకం' : ప్రారంభించిన స్టాలిన్

ప్యారీస్, ఆగస్టు 22: విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి పెంపొందించే పథకాన్ని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ పరిచయం చేసింది. ఈ పథకం కింద ఎంపిక చేసిన 120 మంది విద్యార్థినీ, విద్యార్థులను ప్రోత్సహించేలా వారికి నెలకు రూ.25 వేలు ఆర్థికసాయం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గురువారం సచివాయంలో జరిగిన కార్యక్రమంలో ప్రోత్సాహక నిధుల ఉత్తర్వులను ముఖ్యమంత్రి స్టాలిన్ లబ్దిదారులకు అందజేసి అభినందించారు. గిండిలోని అన్నా విశ్వవిద్యాలయంలో 2022 ఆగస్టు 30న జరిగిన వైస్ ఛాన్సలర్ల మహానాడులో పాల్గొన్న ముఖ్యమంత్రి స్టాలిన్, పరిశోధన కోర్సుల్లో చేరే విద్యార్థులను ప్రోత్సహించేలా వారికి ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత విద్యాశాఖ అర్హత పరీక్షలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు సీఎం ఆ సభలో హామీ ఇచ్చారు. ఆ మేరకు పరిశోధన విద్యార్థులను ఎంపిక చేసేందుకు టీచర్ రిక్రూట్‌మెంట్ బోర్డు 2023 డిసెంబరు 10న రాతపరీక్ష నిర్వహించారు. ఇందులో 60 మంది విద్యార్థులు సైన్స్‌లో, మరో 60 మంది ఇతర పాఠ్యాంశాల్లో ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు తమ పరిశోధన కోర్సులను ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో కొనసాగించేందుకు వీలుగా రూ.25,000 చొప్పున మూడేళ్లకు ప్రోత్సాహక నిధి అందజేసేందుకు ప్రభుత్వం రూ.12.31 కోట్లు కేటాయించింది. ఈ మహత్తర పథకాన్ని సీఎం స్టాలిన్ ప్రారంభించి పైలెట్ ప్రాజెక్ట్ కింద 10 మంది విద్యార్థులకు ఉత్తర్వులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యాశాఖ మంత్రి పొన్ముడి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, ఉన్నత విద్యాశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి ప్రదీప్ యాదవ్, కళాశాల విద్యాశాఖ డైరెక్టర్ ఎస్.కార్మేగం తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు

ప్రత్యేక విభాగాల మెడికల్ కౌన్సెలింగ్ ప్రారంభం

ప్యారీస్, ఆగస్టు 22: స్థానిక ఓమందూర్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ప్రాంగణంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో చేరేందుకు ప్రత్యేక విభాగాల వారికి కౌన్సెలింగ్ గురువారం ప్రారంభమైంది. రాష్ట్రంలో ఉన్న వైద్యకళాశాలల్లో 2024-25వ విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలకు జనరల్ కేటగిరీ కౌన్సెలింగ్ బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. ఈ నెల 23వ తేది వరకు కొనసాగనుంది. 24వ తేది నుంచి 26 వరకు బ్యాంకులు సెలవులు కావడంతో అందరికీ అవకాశం కల్పించేలా ఈ నెల 27,28 తేదీల వరకు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో అన్నాసాలైలోని ఓమందూర్ ప్రభుత్వ ఎస్టేట్ ప్రాంగణంలో ఉన్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రాంగణంలో ప్రత్యేక విభాగం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఇందులో 7.5 శాతం అంతర్గత రిజర్వేషన్ కోటాలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, మాజీ సైనికుల వారసులు, దివ్యాంగులు, క్రీడా విభాగం విద్యార్థులు పాల్గొంటారు. మొత్తం 866 సీట్లకు 1,200 మంది విద్యార్థులనుఆహ్వానించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 624 సీట్లను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో ఎంబీబీఎస్‌లో 496 సీట్లు, బీడీఎస్‌లో 128 సీట్లు భర్తీ చేయనున్నారు. కాగా, దివ్యాంగుల విభాగంలో ఎంబీబీఎస్‌లో 212 సీట్లు, బీడీఎస్‌లో 11 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులకు 133 మంది విద్యార్థులు అర్హత పొందారు. అందువల్ల మిగతా సీట్లను జనరల్ కేటగిరీకి మళ్లించారు. ఇక, మాజీ సైనికుల వారసులకు ఎంబీబీఎస్‌లో 10 సీట్లు, బీడీఎస్‌లో 1 సీటు కేటాయించగా, ఇందులో పాల్గొనేందుకు 30 మందిని ఆహ్వానించారు. స్పోర్ట్స్ కోటాలో ఎంబీబీఎస్‌లో 7 సీట్లు, బీడీఎస్‌లో 1 సీటు అందుబాటులో ఉండగా, ఇందులో పాల్గొనేందుకు 15 మందిని ఆహ్వానించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి



ప్రమాదం జరిగిన దృశ్యం

పెరంబూర్, ఆగస్టు 22: దిండుగల్ జిల్లా నత్తం సమీపంలో గురువారం ఉదయం పాఠశాల బస్సును ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు లింగవాడికి చెందిన మురుగన్ (40), భార్య పంజు (35), కుమారుడు శ్రీధర్ (6)తో ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. అదే సమయంలో అళగర్‌కోయిల్ సమీపంలోని ఓ ప్రైవేటు పాఠశాల బస్సు వెళ్తోంది. ఆ సమయంలో నత్తం-మదురై నాలుగు రోడ్ల జంక్షన్ ముడక్కుసాలై ప్రాంతంలో ద్విచక్రవాహనం రాంగ్ రూట్‌లో వచ్చి పాఠశాల బస్సును ఢీకొంది. ఈ ఘటనలో మురుగన్, భార్య, కుమారుడు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. నత్తం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

రేషన్ దుకాణాల్లోనూ ఆవిన్ ఉత్పత్తులు

- త్వరలో విక్రయాలు ప్రారంభం



ప్యారీస్, ఆగస్టు 22: పౌర సరఫరాల శాఖ నిర్వహణలోని రేషన్ దుకాణాల్లో ఆవిన్ ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు ఆ శాఖ మంత్రి మనో తంగరాజ్ ప్రకటించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రజాదరణ పెరుగుతున్న ఆవిన్ ద్వారా అశ్వగంధ, అల్లం, మూలికా ఔషధాల మిశ్రమంతో పాలను పరిచయం చేసినట్లు తెలిపారు. ఫిబ్రవరిలో అసెంబ్లీలో ప్రకటించిన మేరకు రైతుల నుంచి పాలు సేకరించేందుకు తుప్పుపట్టని పాల క్యాన్లు, పాల నాణ్యత కొలిచే పరికరం, ఉపకరణాలు తదితరాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 36 లక్షల నుంచి 37 లక్షల లీటర్ల పాలు కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు. కొత్త ఆవిన్ ఉత్పత్తుల పరిచయ పథకం కింద అశ్వగంధ పాలు, పసుపు మిరియాల పాలు, సొంఠి, కొత్తిమల్లి కాఫీ తదితర మూడు రకాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఆవిన్ ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు ఉత్సాహంగా ముందుకొస్తున్నారని, అందువల్ల త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రేషన్ దుకాణాల్లో మిల్క్ షేక్, కుకీస్, నెయ్యి, ఇతర పాల ఉత్పత్తులు విక్రయించే పనులు జరుగుతున్నాయని తెలిపారు. సహకార శాఖ ద్వారా 34,567 రేషన్ దుకాణాలు పనిచేస్తున్నాయని, వీటితో పాటు సూపర్ మార్కెట్లలో ఆవిన్ పాల ఉత్పత్తులు విక్రయించడంపై పరిశీలిస్తున్నట్లు మంత్రి వివరించారు.

రెండు నెలల్లో విశ్వవిద్యాలయాల్లో స్నాతకోత్సవాలు

- ప్రకటించిన రాజ్ భవన్

పెరంబూర్, ఆగస్టు 22: రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు మరో రెండు నెలల్లో స్నాతకోత్సవాలు నిర్వహించనున్నట్లు రాజ్‌భవన్ ప్రకటన విడుదల చేసింది. మద్రాసు విశ్వవిద్యాలయం, ఉపాధ్యాయ విశ్వవిద్యాలయం సహా ఐదు విశ్వవిద్యాలయాల ఉపకులపతి పోస్టులు ఖాళీగా ఉండడంతో, ఆ వర్సిటీలకు స్నాతకోత్సవాలు నిర్వహించడంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కోర్సులు పూర్తయిన విద్యార్థులు డిగ్రీలు అందుకోకపోవడంతో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో చేరేందుకు అవకాశం లేకుండా పోయింది. ఖాళీగా ఉన్న ఉపకులపతుల పదవులు సత్వరం భర్తీచేయాలని ఈ విషయమై పలు పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఇదే అంశంపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ తరపున గవర్నర్‌కు లేఖ రాశారు. దీనిపై రాజ్‌భవన్ స్పందిస్తూ... 2023 నుంచి 2024 ఏప్రిల్ వరకు 18 విశ్వవిద్యాయాల్లో స్నాతకోత్సవాలు పూర్తిచేశామని, మిగిలిన విశ్వవిద్యాలయాల్లో రెండు నెలల్లో స్నాతకోత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అలాగే, ఉపకులపతులేని విశ్వవిద్యాలయాల్లో స్నాతకోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లు, విద్యార్థులు జాబితా సిద్ధం చేయాలని రాజ్‌భవన్ ఉత్తర్వులు జారీచేసింది.



రాజ్‌భవన్ భారతియార్ మండపంలో ఏర్పాటుచేసిన జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

సమాచార దర్శిని

1న సిరువాపురి ఆలయంలో కల్యాణోత్సవం

ఐసిఎఫ్, ఆగస్టు 22: తిరువళ్లూర్ జిల్లా పెరియపాళయం సమీపంలో ఉన్న సిరువాపురి బాలసుబ్రమణ్య స్వామి ఆలయంలో సెప్టెంబరు 1వ తేది తిరుకల్యాణోత్సవం జరుగనుంది. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి వినాయకుడు, ఆదిమూలవర్, అన్నామలైయార్, ఉన్నామలై అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించనున్నారు. 7 గంటలకు మూలవిరాట్టుకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, 9 గంటలకు వల్లి అమ్మవారికి అభిషేకం, 11 గంటలకు తిరుకల్యాణోత్సవం జరుగనున్నాయి. మధ్యాహ్నం స్వామివారి ఊరేగింపు అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.

ఆంధ్ర కళా స్రవంతి ఆధ్వర్యంలో 25న జన్మాష్టమి వేడుకలు

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కళాస్రవంతి తెలుగు కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన ఉదయం 9.30 గంటలకు జన్మాష్టమి వేడుకలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా 1-10 ఏళ్ల బాలలకు బాలకృష్ణుడి ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు జరుగనున్నాయి. కొరట్టూర్ అగ్రహారం, అన్నల్ అవెన్యూలో వున్న కోదండ రామాలయంలో జరుగనున్న ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. ఔత్సాహికులు 9840078727, 9884226444 మొబైల్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

నేడు జాబ్ మేళా

ఐసిఎఫ్, ఆగస్టు 22: నగరంలోని అన్ని ప్రభుత్వ ఎంప్లాయ్‌మెంట్, వృత్తి మార్గదర్శక కేంద్రాలు సంయుక్తంగా శుక్రవారం ఉద్యోగావకాశ శిబిరం నిర్వహించనున్నాయి. గిండి ఆలందూర్ రోడ్డులో ఉన్న ఉద్యోగావకాశాల కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే శిబిరంలో 8వ తరగతి నుంచి ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ తదితర కోర్సులు చేసిన వారు హాజరుకావచ్చు.

రూ.400 కోట్లతో టీఎన్ ఇంజన్ ఫెసిలిటీ సెంటర్

ఐసిఎఫ్, ఆగస్టు 22: కోయంబత్తూర్ రూ.400 కోట్లతో తమిళనాడు ఇంజన్ ఫెసిలిటీ కేంద్రం ఏర్పాటు కానుంది. రాష్ట్రప్రభుత్వ వృత్తుల అభివృద్ధి సంస్థ (టిడ్కో), టాటా టెక్నాలజీస్ సంయుక్తంగా కోయంబత్తూర్‌లో తమిళనాడు ఇంజనీరింగ్, ఇన్నోవేషన్ కేంద్రం పేరుతో జనరల్ ఇంజన్ ఫెసిలిటీ సెంటర్ ప్రారంభించనున్నాయి. ఈ కేంద్రం వైమానిక, యాంత్రిక వంటి శాఖల్లో ఉన్న సంస్థలకు అవసరమయ్యే ఇంజనీరింగ్ టూల్స్ అందజేయనుంది.

25 నుంచి చిత్రకళా ప్రదర్శన

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రీమ్స్‌రోడ్డులో వున్న లలిత కళా అకాడమీలో ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు చిత్రప్రదర్శన ప్రారంభం కానుంది. ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగనున్న ఈ ప్రదర్శనను సందర్శకులు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి సాయంత్రం 7 గంటల వరకు వీక్షించవచ్చు. ప్రదర్శన ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా లలిత కళా అకాడమీ రీజనల్ సెక్రటరీ ఎం.సోవన్‌కుమార్, విజువల్ కళాకారులు హెలెన్ బ్రహ్మ ముఖ్య అతిథిగా, సాయి ఆర్ట్స్ వ్యవస్థాపకులు ఇ.వేదాచలం, ప్రముఖ కళాకారుడు జి.అంకయ్య గౌరవ అతిథులుగా హాజరుకానున్నారు. ఈ చిత్రలేఖన ప్రదర్శనకు అందరూ ఆహ్వానితులేనని నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

డిపార్ట్‌మెంట్ పరీక్షల్లో దివ్యాంగులకు మినహాయింపు

ఐసిఎఫ్, ఆగస్టు 22: టీఎన్‌పీఎస్సీ నిర్వహించే డిపార్ట్‌మెంట్ పరీక్షల్లో దివ్యాంగులకు మినహాయిస్తూ దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యదర్శి సిజి థామస్ వైద్యనాథన్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకొనే వయోః పరిమితిలో దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంది. ఈ క్రమంలో, పలువురు 40 ఏళ్లలో ఉద్యోగాల్లో చేరుతున్నారు. వారి పదోన్నతికి ఆయా శాఖలు నిర్వహించే పరీక్షల్లో అంధులు, వినికిడి లోపం కలిగిన వారు వంటి దివ్యాంగులు ఉత్తీర్ణులు కాలేకపోతున్నారు. దీంతో పదోన్నతులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆ పరీక్షల్లో మినహాయింపు ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పరందూర్-ఆవడి మెట్రో నివేదిక కోసం రూ.4.80 కోట్లు

ఐసిఎఫ్, ఆగస్టు 22: పరందూర్-ఆవడి మెట్రో పథకం నివేదిక తయారీకి రూ.4.80 కోట్లు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం జీవో విడుదల చేసింది. నగరంలో రెండో విడత మెట్రో ఏర్పాటులో మూడు మార్గాల్లో రూ.69,180 కోట్లతో 116 కి.మీ మేర పనులు జరుగుతున్నాయి. ఈ పనులన్నీ 2028 సంవత్సరంలోగా పూర్తిచేసేందుకు లక్ష్యం నిర్దేశించారు. సిరుచ్చేరి-కిలంబాక్కం, పూందమల్లి-పరందూర్, కోయంబేడు-ఆవడికి మెట్రోరైలు సేవలు పొడిగించడంపై సాధ్యాసాధ్యాలకు సంబంధించిన నివేదిక తయారుచేశారు. ఈ క్రమంలో, పూందల్లి-పరందూర్, కోయంబేడు-ఆవడి పథకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ రెండు మార్గాల్లో విస్తృత పథక నివేదిక తయారీకి రూ.4.80 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది.

నేడు పనిచేయని మురుగునీటి పంపింగ్ స్టేషన్లు

ఐసిఎఫ్, ఆగస్టు 22: స్థానిక కొళత్తూర్, శివానంద ఏరియా ప్రాంతాల్లో ఉన్న మురుగునీటి పంపింగ్ స్టేషన్లు పైప్ లైన్ పనుల కారణంగా శుక్రవారం పనిచేయవని చెన్నై మెట్రోవాటర్ బోర్డు అధికారులు తెలిపారు. మాధవరం మండలం 200 అడుగుల రోడ్డులో ఉన్న రెట్టేరి సర్వీస్ రోడ్డులో మురుగునీటి పైప్ లైన్ కనెక్షన్ పనులు జరుగనున్నాయి. దీంతో, శుక్రవారం ఉదయం 9 నుంచి శనివారం రాత్రి 9 గంటల వరకు మండలం-6 పరిధిలోని కొళత్తూర్, శివానంద ఏరియాలో ఉన్న మురుగునీటి పంపింగ్ స్టేషన్లు పనిచేయవు. ఈ ప్రాంతాల్లో భూగర్భ డ్రైనేజీ నుంచి మురుగునీరు బయటకు పొంగడం, ఇతర సమస్యలకు 8144930906 నెంబరు సంప్రదించాలని అధికారులు సూచించారు.

31లోగా గుంతలు పూడ్చాలి

ఐసిఎఫ్, ఆగస్టు 22: రోడ్లపై తవ్విన గుంతలను రుతుపవన వర్షాలకు ముందే పూడ్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గత ఏడాది కురిసిన ఈశాన్య రుతుపవన వర్షాలకు చెన్నై, తిరునల్వేలి, తూత్తుకుడి జిల్లాల్లో భారీగా నష్టం ఏర్పడింది. ఈ ఏడాది ఈ వర్షాలను ఎదుర్కొనేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రహదారుల్లో అక్కడక్కడా తవ్విన గుంతలను ఈ నెల 31వ తేదిలోగా పూడ్చాలని ఆయా శాఖలకు ఉత్తర్వులు జారీచేశారు.

79వ ఆలిండియా రైల్వే ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభం

పెరంబూర్, ఆగస్టు 22: స్థానిక అయనావరం ఫుట్ బాల్ మైదానంలో 79వ ఆలిండియా ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2024-25 పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను దక్షిణ రైల్వే అడిషినల్ జనరల్ మేనేజర్ కౌషల్ కిషోర్ ప్రారంభించారు. కార్యక్రమంలో దక్షిణ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమేష్‌కుమార్, సెక్రటరీ పి.బాలసుందర్, సీనియర్ స్పోర్ట్స్ ఆఫీసర్ కె.శారమ్మ, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వి.దేవరాజన్, దక్షిణ రైల్వే స్పోర్ట్స్ పర్సన్ పి.అనిత తదితరులు పాల్గొన్నారు. అయనావరం ఫుట్‌బాల్ మైదానంలో 42 ఏళ్ల అనంతరం ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పోటీల్లో రైల్వే శాఖ పరిధిలోని వివిధ జోన్ల నుంచి 364 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 13 రైల్వే జోన్ల పరిధిలోని టీమ్‌లకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రైల్వేస్ ఫుట్ బాల్ టీమ్‌కు ఎంపిక చేయనున్నామని, ఈ పోటీలు ఈ నెల 31వ తేది వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.



క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తున్న అడిషినల్ జనరల్ మేనేజర్ కౌషల్ కిషోర్

మేము లేకపోతే మీకు ప్రతిపక్ష హోదా లేదు...!

● అన్నాడీఎంకేకు కేంద్రమంత్రి కౌంటర్

పెరంబూర్, ఆగస్టు 22: అన్నాడీఎంకే పెట్టిన భిక్షతో బీజేపీకి నలుగురు ఎమ్మెల్యేలున్నారంటూ మాజీ మంత్రి డి.జయకుమార్ వ్యాఖ్యలపై బీజేపీ సీనియర్ నేత, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ ఘాటుగా స్పందించారు. బీజేపీ లేకపోతే అన్నాడీఎంకేకు ప్రతిపక్ష హోదా కూడా దక్కేది కాదని విమర్శించారు. అప్పటి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణులు అన్నాడీఎంకేకు ఓట్లు వేశారని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

ఆవిన్ ఉద్యోగినులకు 'ఓవర్ కోట్'

● మంత్రి మనో తంగరాజ్

పెరంబూర్, ఆగస్టు 22: ఆవిన్ మహిళా ఉద్యోగుల రక్షణ కోసం విధి నిర్వహణలో 'ఓవర్ కోట్' ధరించేలా చర్యలు చేపట్టినట్లు పాడిపరిశ్రమల శాఖ మంత్రి మనో తంగరాజ్ తెలిపారు. నగరంలో బుధవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... తిరువళ్లూర్ జిల్లా కాకలూరు ఆవిన్ కేంద్రంలోని కంటైనర్ బెల్ట్ 25 ఏళ్లుగా పనిచేస్తుండగా, ఇప్పటివరకు ఎలాంటి ప్రమాదాలు జరగలేదన్నారు. కంటైనర్ బెల్ట్‌లో చుడిదార్ దుప్పట్ట, చెయిన్ చిక్కుకోవడంతో ఉద్యోగిని మృతిచెందిందని తెలిపారు. ఇది పూర్తిగా స్వీయ జాగ్రత్త తీసుకోకపోవడమే కారణంగా ఉందన్నారు. దుప్పట వేసుకొని అక్కడ పనిచేసేందుకు అనుమతి లేదన్నారు. గ్రామాల నుంచి విధులకు వస్తున్న మహిళలు దుప్పట్టా ధరించేందుకు అనుమతించాలని అభ్యర్థించడంతో అధికారులు అనుమతించారని తెలిపారు. భవిష్యత్తులో ఈ నిబంధన తప్పక అమలుజరగాలని అధికారులను ఆదేశించామన్నారు. మృతురాలి కుటుంబానికి పరిహారం అందించే విషయం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి తెలిపారు.

ఎలియాట్స్ బీచ్‌లో దివ్యాంగులకు ప్రత్యేక బాట

పెరంబూర్, ఆగస్టు 22: గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో మెరీనా బీచ్‌లో ఏర్పాటు చేసినట్లుగా, బీసెంట్ నగర్ ఎలియాట్స్ బీచ్‌లో రూ.1.61 కోట్లతో దివ్యాంగులకు ప్రత్యేక బాట నిర్మిస్తున్నారు.. సముద్రపు అలలు దగ్గరగా చూడాలని, సముద్రపు నీటిలో కాళ్లు తడుపుకోవాలని దివ్యాంగులకు ఎంతో ఆశ. కానీ, మెరీనా బీచ్ ప్రారంభం నుంచి అలల వద్దకు ఇసుకలో వెళ్లాలంటే వారికి సాధ్యం కాదు. దీనిపై దృష్టి సారించిన కార్పొరేషన్, మెరీనా బీచ్‌లో 3 మీటర్ల వెడల్పుతో 380 మీటర్ల పొడవున దివ్యాంగులకు ప్రత్యేక బాట ఏర్పాటుచేసింది. తమ ట్రై సైకిళ్లలో దివ్యాంగులు ఈ బాట మీదుగా సముద్రపు అలల దగ్గరకు వెళ్లి చూసే అవకాశం కలిగింది. ఈ నేపథ్యంలో, బీసెంట్ నగర్ ఎలియాట్స్ బీచ్‌లోనూ రూ.1.61 కోట్లతో 2.90 మీటర్ల వెడల్పుతో 190 మీటర్ల మేర దివ్యాంగుల ప్రత్యేక బాట నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇది తాబేళ్లు గుడ్లు పెట్టే ప్రాంతం కావడంతో కాంక్రీట్ నిర్మాణం చేపట్టరాదని పర్యావరణ శాఖ నిబంధన విధించింది. దీంతో, 100 శాతం దుంగలతోనే నిర్మించనున్నట్లు, మరో నాలుగు నెలల్లో ఈ బాట అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.



ఎలియాట్స్ బీచ్‌లో దివ్యాంగుల ప్రత్యేక బాట నిర్మాణం

డిగ్రీలు ప్రదానంపై గవర్నర్‌కు ప్రభుత్వం లేఖ

పెరంబూర్, ఆగస్టు 22: మద్రాసు విశ్వవిద్యాలయంలో కోర్సులు పూర్తయిన విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసేలా చర్యలు చేపట్టాలని ఉన్నత శాఖ తరఫున రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవికి లేఖ రాశారు. రాష్ట్రంలో మద్రాసు విశ్వవిద్యాలయం సహా ఐదు విశ్వవిద్యాలయాల ఉపకులపతి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందువల్ల ఈ వర్సిటీల్లో కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు సకాలంలో డిగ్రీలు పొందలేకపోతున్నారు. మద్రాసు విశ్వవిద్యాలయంలో మాత్రమే సుమారు 50,000 మంది విద్యార్థులు కోర్సులు పూర్తిచేసి సర్టిఫికేట్ల కోసం ఎదురుచూస్తున్నారు. అందువల్ల ఉన్నత విద్య, ఉద్యోగాల్లో చేరేందుకు వారికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై విద్యార్థులు, తల్లిదండ్రులు వర్సిటీ నిర్వాహకులకు ఫిర్యాదు కూడా చేస్తున్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ తరఫున గవర్నర్ ఆర్ఎన్ రవికి రాసిన లేఖలో... రాష్ట్రంలో మద్రాసు విశ్వవిద్యాలయం, ఉపాధ్యాయ విశ్వవిద్యాలయం సహా ఐదు విశ్వవిద్యాలయాల్లో ఉపకులపతి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందువల్ల ఆయా విశ్వవిద్యాలయాల్లో స్నాతకోత్సవాలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. తక్షణం ఖాళీగా ఉన్న ఉపకులపతుల పోస్టుల భర్తీచేయడంతో పాటు, స్నాతకోత్సవాలు నిర్వహించి విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేసేలా చర్యలు చేపట్టాలని లేఖలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు.

మూడు రోజుల్లో బ్యానర్లు తొలగించాలి

ఐసిఎఫ్, ఆగస్టు 22: నగరంలో ఏర్పాటుచేసిన బ్యానర్లు మూడు రోజుల్లో తొలగించాలని చెన్నై కార్పొరేషన్ ఆదేశించింది. ఈ మేరకు కార్పొరేషన్ విడుదల చేసిన ప్రకటనలో... కోర్టు కేసులకు సంబంధించిన, అనుమతి పొందిన ప్రకటన బ్యానర్లు మినహా అనుమతి లేని బ్యానర్లను సంబంధిత ప్రకటన సంస్థలు, భవనాల యజమానులు మూడు రోజుల్లో తొలగించాలని పేర్కొంది. ప్రకటన బోర్డులు ఏర్పాటుకు ముందు ఆ సంస్థలు కార్పొరేషన్ అనుమతి పొందాలని సూచించింది. అనుమతి లేకుండా బ్యానర్ల, ప్రకటన బోర్డులు ఏర్పాటుచేసే వారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని కార్పొరేషన్ హెచ్చరించింది.

నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన నేల వంతెన



తిరుమణి ప్రాంతంలో కొట్టుకుపోయిన నేల వంతెన

వేలూరు, ఆగస్టు 22: స్థానిక కాట్పాడి, లత్తేరి ప్రాంతాల్లో కొద్దిరోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. లత్తేరి సమీపం తిరుమణి ప్రాంతంలోని పాలారు నదిలో ప్రజల సౌకర్యార్థం నేల వంతెన నిర్మించారు. కానీ, ఇటీవల పాలారు నదిలో నీటి ప్రవాహం అధికమై నేల వంతెన కొట్టుకుపోయింది. దీంతో, ప్రజలు సుమారు 20 కి.మీ దూరం చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. వంతెన గతంలో ఒక సారి కొట్టుకుపోగా మళ్లీ నిర్మించారని, ప్రస్తుతం వంతెన కొట్టుకుపోవడంతో 10 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించిన వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

జనసేన ఆధ్వర్యంలో 1న మెగా వైద్య శిబిరం

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 1వ తేదీ టీనగర్ విజయరాఘవరోడ్డులో వున్న ఆంధ్రా క్లబ్ గోదావరి హాలులో మెగా వైద్య, రక్తదాన శిబిరాలు జరుగనున్నాయి. ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగనున్న ఈ శిబిరాల్లో అందరూ పాల్గొనవచ్చని జనసేన పార్టీ చెన్నై కన్వీనర్ తమ్మయ్యనాయుడు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఔత్సాహికులు ఈ శిబిరాల్లో రక్తదానం చేయవచ్చు. నగరంలోని ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రులకు చెందిన వివిధ విభాగాల స్పెషలిస్టులు శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయడంతో పాటు తగిన సూచనలు ఇస్తారు. వివరాలకు 9840281445 మొబైల్ నెంబరులో తమ్మయ్య నాయుడును సంప్రదించవచ్చు.

కౌంటర్లలో రూ.5 వేలకు పైగా నగదు చెల్లింపులుండవు...

● విద్యుత్ బోర్డు

పెరంబూర్, ఆగస్టు 22: రాష్ట్ర విద్యుత్ వినియోగదారుల సంఖ్య 3.32 కోట్లు ఉండగా, వాటిలో 24 లక్షలు ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు కాగా, మిగిలినవి ఇళ్లు, వాణిజ్య సముదాయాలు, కర్మాగారాలకు చెందినవి. విద్యుత్ రీడింగ్‌కు అనుకూలంగా బిల్లులు వసూలుచేస్తుంటారు. కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, రూ.10 వేలకు పైబడిన బిల్లులను రొక్కంగా తీసుకోరాదు. ఆ ప్రకారం, ప్రస్తుతం 83 శాతానికి పైగా డిజిటల్ విధానంలో బిల్లులు చెల్లింపు జరుగుతోంది. దీనిని 100 శాతం పెంచేలా విద్యుత్ బోర్డు చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు రొక్కంగా రూ.10 వేలు తీసుకోరాదన్న నిబంధన రూ.5 వేలకు తగ్గించింది. ఆ ప్రకారం, విద్యుత్ బోర్డు బిల్లు చెల్లింపు కార్యాలయాల్లో రూ.5 వేలకు పైగా నగదు స్వీకరించరు. డీడీ, చెక్కు చెల్లించాల్సి ఉంటుంది. అదే సమయంలో ఆన్‌లైన్‌లో డెబిట్, క్రెడిట్ ద్వారా చేపట్టే చెల్లింపులకు ఎలాంటి నిబంధనలు లేదని విద్యుత్ బోర్డు తెలియజేసింది.

'నాన్ ముదల్‌వన్' పథకంలో 30 లక్షల మంది లబ్ధి

● మంత్రి ఉదయనిధి

ప్యారీస్, ఆగస్టు 22: 'నాన్ ముదల్‌వన్' పథకం ద్వారా సుమారు 30 లక్షల మందికి పైగా విద్యార్థులు లబ్ధిపొందినట్లు రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. రాయపురం నియోజకవర్గంలోని భారతి మహిళా కళాశాల ప్రాంగణంలో పెరుంతలైవర్ కామరాజర్ కళాశాల అభివృద్ధి పథకం కింద రూ.25 కోట్లతో నిర్మించిన కలైంజర్ సెంటినరీ భవనాన్ని గురువారం ఉదయం మంత్రి ఉదయనిధి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొన్ముడి, పీకే శేఖర్‌బాబు, ఎంపీ దయానిధి మారన్, నగర మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చి మహిళా సీఐ సస్పెన్షన్

ప్యారీస్, ఆగస్టు 22: తిరుచ్చి కార్పొరేషన్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన కామిని, ఆ కార్పొరేషన్ పరిధిలో నేరాల సంఖ్య తగ్గించేలా చర్యలు చేపట్టారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై గూండా చట్టం ప్రయోగించి అరెస్ట్ చేయిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుచ్చి కేకే నగర్ నేర విభాగం సీఐ హంసవేణి (45)ని సస్పెండ్ చేస్తూ గురువారం కామిని ఉత్తర్వులు జారీచేశారు. ఖైదీని విచారణ నిమిత్తం కోర్టులో హాజరుపరిచేందుకు తీసుకెళ్తున్న సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందున సస్పెండ్ చేశారు.

ఉదయనిధి డిప్యూటీ సీఎం కావాలి

● మంత్రి శివశంకర్

ప్యారీస్, ఆగస్టు 22: డీఎంకే కార్యకర్తలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఉదయనిధి త్వరలో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శివశంకర్ అభిప్రాయపడ్డారు. అరియలూరులో గురువారం క్రీడాభివృద్ధి కమిషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్న మంత్రి శివశంకర్, క్రీడాభివృద్ధి శాఖ మంత్రిగా ఉదయనిధి వ్యవహరిస్తున్న తీరును రాష్ట్ర ప్రజలు ఆహ్వానిస్తున్నారని, ఆయన త్వరలోనే ఉప ముఖ్యమంత్రిగా రావాలని వేలాది మంది కార్యకర్తలు కోరుతున్నారని మంత్రి తెలిపారు.

వీఐటీ విశ్వవిద్యాలయంలో అవగాహన కార్యక్రమం

ప్యారీస్, ఆగస్టు 22: చెంగల్పట్టు జిల్లా తిరుపోరూర్ సమీపంలోని వీఐటీ విశ్వవిద్యాలయంలో ఆహార భద్రతా విభాగం ఆధ్వర్యంలో 'ఆహారమే మందు' అవగాహన కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా మంత్రులు ఎం.సుబ్రమణ్యం, టీఎం అన్బరసన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పోషకాలు అధికంగా ఉన్న ఆహారానికి సంబంధించిన ప్రదర్శనను మంత్రులు తిలకించారు. అనంతరం అవగాహనపై రూపొందించిన డాక్యుమెంటరీ, కరపత్రాలను మంత్రులు ఆవిష్కరించారు. మిగిలిపోతున్న ఆహార పదార్థాలు వృధాకాకుండా ఆకలితో ఉన్న వారికి పంపిణీ చేసేందుకు వీలుగా వీఐటీ వర్సిటీ ఛాన్సలర్ విశ్వనాధన్ వాహనం కొనుగోలుకు రూ.5.40 లక్షల చెక్‌ను మంత్రులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌రాజయ్, జిల్లా ఆహార భద్రతా విభాగం అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలసి అల్పాహారం తీసుకున్న కలెక్టర్

వేలూరు, ఆగస్టు 22: గుడియాత్తం డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనులను కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. బుధవారం రాత్రి 8 గంటల నుంచి గురువారం ఉదయం 8 గంటల వరకు వివిధ శాఖల అధికారులతో కలసి గ్రామంలో బసచేశారు. గురువారం ఉదయం పిచ్చానూరు గంగాధరస్వామి మాధ్యమిక పాఠశాలకు వెళ్లిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం నాణ్యత పరిశీలించడంతో పాటు వారితో కలసి తీసుకున్నారు. అనంతరం చెత్త నుంచి ఎరువు తయారుచేస్తున్న కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు, గుడియాత్తం మున్సిపాలిటీ అధ్యక్షుడు సౌందర్‌రాజన్, గుడియాత్తం సబ్ కలెక్టర్ సుబలక్ష్మి, మున్సిపాలిటీ కమిషనర్ మంగైకరసన్, తహసీల్దార్ చిత్రా దేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి తింటున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

తప్పించుకుని పారిపోయిన ఖైదీ

వేలూరు, ఆగస్టు 22: స్థానిక కాట్పాడి ధారాపడవీడు ప్రాంతానికి చెందిన కమలేష్ (22)పై 10 దొంగతనాలు, 2 హత్యాకేసులున్నాయి. ఓ కేసుకు సంబంధించి కమలేష్‌ను అరెస్ట్ చేసి కాట్పాడి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఆ సమయంలో అతను పోలీసులు కళ్లుగప్పి తప్పించుకొని పారిపోయాడు. కమలేష్‌ను పట్టుకొనేందుకు ప్రత్యేక పోలీసు బృందంపై ఏర్పాటైంది.

ఎంటీసీకి రూ.300 కోట్లు కేటాయింపు

పెరంబూర్, ఆగస్టు 22: చెన్నై మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ఆదాయం, వ్యయాల వ్యత్యాసం భర్తీచేసేలా రూ.300 కోట్లు కేటాయించారు. ప్రపంచ బ్యాంక్ ఆర్థిక సహాయంతో చెన్నై సిటీ పార్టనర్‌షిప్ ప్రాజెక్ట్ కింద ఈ నిధులు కేటాయిస్తూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉత్తర్వులు జారీచేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 22: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

ఉస్మాన్ రోడ్డు: బజుల్లా రోడ్డు, చారి వీధి, పార్థసారథి పురం, ఉన్నామలై అమ్మన్ వీధి, హబీబుల్లా రోడ్డు, రంగన్ వీధి, దురైస్వామి రోడ్డు, రాజన్ వీధి, అరులాంబాళ్ వీధి, గాంధీ వీధి, జవహర్‌లాల్ నెహ్రూ వీధి, రామచంద్ర అయ్యర్ వీధి, రాజపిళ్లై గార్డన్, మాంబళం హైరోడ్డు, కోడంబాక్కం హైరోడ్డు, నార్త్ ఉస్మాన్ రోడ్డు, రంగరాజపురం, అజీస్ నగర్, పరాంకుశపురం, అక్బరాబాద్, సీఆర్పీ గార్డన్, మంగేష్ వీధి, రైల్వే బార్డర్ రోడ్డు, రైల్వే స్టేషన్ న్యూ రోడ్డు

అత్తిపట్టు: ఐసిఎఫ్‌కాలని, స్లమ్ బోర్డు, అత్తిపట్టు, సెల్లియమ్మన్ ఆలయ వీధి, సెల్లియమ్మన్ నగర్, అగ్ని ఎస్టేట్, ఎంజీఆర్ పురం, ఆవిన్ మెయిన్ రోడ్డు, ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ నుంచి ఆవిన్ పార్లర్ వరకు, నార్త్ సిడ్కో ఎస్టేట్

బీసెంట్ నగర్: రుక్మిణి రోడ్డు, టైగర్ వరదాచారి రోడ్డు, బీసెంట్ నగర్ 7వ అవెన్యూ, గంగై వీధి, అరున్‌టేల్ బీచ్ రోడ్డు

నంగనల్లూర్: నెహ్రూ కాలని, 5వ మెయిన్ రోడ్డు 39 నుంచి 42 వీధులు, కన్నగి వీధి, కులకరై వీధి, కపిలర్ వీధి, కాలేజ్ రోడ్డు, వేంబులి అమ్మన్ ఆలయ వీధి, నాలుగవ మెయిన్ రోడ్డు

సెయింట్ థామస్ మౌంట్: మీనంబాక్కం కస్టమ్స్ కార్యాలయం, భారత్ స్టేట్ బ్యాంక్, పోస్టాఫీసు, కుమరన్ నగర్, రాజీవ్ గాంధీ వీధి, వావూసీ వీధి, అన్నా వీధి, భారతియార్ వీధి, మీనంబాక్కం, పాండ్యన్ వీధి, విరుదునగర్ హోటల్, హోండా షోరూమ్, బీఎండబ్ల్యూ షోరూమ్, క్వీన్ రోడ్డు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, చూలైమేడు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో

మరో ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 22: ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో మరో ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేయడంతో, ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 27కు చేరింది. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ పెరంబూర్‌లో జూలై 5వ తేది దారుణ హత్యకు గురయ్యాడు. ఈ కేసులో ఆరుగురు న్యాయవాదులు సహా 24 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ హత్యతో సంబంధాలున్న రౌడీలు సంభవం సెంథిల్, సీసింగ్ రాజా తదితరులను ప్రత్యేక విభాగం పోలీసులు గాలిస్తున్నారు. వీరిలో, సెంథిల్‌తో సంబంధాలున్న న్యాయవాది కృష్ణకుమార్ అలియాస్ మొట్టై కృష్ణన్‌ను కూడా పోలీసులు గాలిస్తుండగా, అతను మలేసియాకు తప్పించుకు వెళ్లినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటికే సంభవం సెంథిల్‌పై లుక్ ఔట్ నోటీసు జారీచేసిన నేపథ్యంలో, తాజాగా రెడ్ కార్నర్ నోటీసు కూడా జారీ అయింది. ఇక, ఈ కేసుకు సంబంధించి చిత్ర దర్శకుడు నెల్సన్ భార్య మోనీషానే పోలీసులు విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసుకు సంబంధించి రాజేష్, గోపి, కుమరన్‌లను ప్రత్యేక విభాగం పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. వీరు నాటుబాంబులు మార్చేందుకు సహకరించారన్న ఆరోపణల నేపథ్యంలో, వీరిని పోలీసులు అరెస్ట్ చేశారు.

జలపాతం నుంచి రాళ్లు పడి ఐదుగురికి గాయాలు

పెరంబూర్, ఆగస్టు 22: తెన్‌కాశి జిల్లా కుట్రాలం ప్రధాన జలపాతం పైనుంచి హఠాత్తుగా రాళ్లు పడిన ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. కుట్రాలం జలపాతాల వద్ద ప్రస్తుతం వరద ప్రవాహం తక్కువగా ఉండడంతో పర్యాటకుల స్నానాలకు అనుమతించారు. ఈ నేపథ్యంలో, బుధవారం సాయంత్రం ప్రధాన జలపాతం వద్ద పురుషులను అనుమతించే ప్రాంతంలో కొందరు స్నానాలు చేసున్నారు. ఆ సమయంలో జలపాతం నుంచి నీటితో పాటు రాళ్లు పడడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని తెన్‌కాశి ప్రభుత్వాసుపత్రికి తరలించిన అధికారులు, భద్రత దృష్ట్యా కుట్రాలం ప్రధాన జలపాతం వద్ద స్నానాలకు నిషేధం విధించారు. తెన్‌కాశి అగ్నిమాపక సిబ్బంది జలపాతం పై ప్రాంతానికి వెళ్లి రాళ్లు ఎలా పడ్డాయని పరిశీలిస్తున్నారు.

ఒకేరోజు పది మంది రౌడీల అరెస్ట్

ఐసిఎఫ్, ఆగస్టు 22: స్థానిక పులియాంతోపు పోలీసు జిల్లా పరిధిలో ఒకే రోజు 10 మంది రౌడీలను ప్రత్యేక విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆమ్‌స్ట్రాంగ్ హత్య అనంతరం చెన్నై పోలీస్ కమిషనర్‌గా అరుణ్ నియమితులయ్యారు. ఆయన ఆదేశాలతో వివిధ కేసులున్న వారు, రౌడీలను పోలీసులు అరెస్ట్ చేస్తున్నారు. ఆ ప్రకారం, బుధవారం పులియాంతోపు పోలీసు జిల్లా పరిధిలో పది మంది రౌడీలను ప్రత్యేక విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు.

వెళ్తున్న కారులో మంటలు

ప్రయాణికుల సురక్షితం

పెరంబూర్, ఆగస్టు 22: రోడ్డుపై వెళుతున్న కారులో హఠాత్తుగా మంటలు ఏర్పడిన ఘటనలో, అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. మడిపాక్కంకు చెందిన శేఖర్, పరమశివన్, శశికుమార్ తదితరులు కారులో బెంగళూరు బయల్దేరారు. తిరుపత్తూర్ జిల్లా ఆంబూరు సమీపం మాదనూరు పొన్నగర్ ప్రాంతంలో చెన్నై-బెంగళూరు రహదారిలో కారు ఇంజన్‌లో పొగలు రావడం గుర్తించి, కారు ఆపి ముగ్గురు కిందకు దిగి దూరంగా పరుగులు తీశారు. వారు కారు దిగిన వెంటనే మంటలు చెలరేగాయి. పరిసరాల వారు ఇచ్చిన సమాచారంతో ఆంబూరు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపుచేశారు. కానీ, ఆలోపే కారు పూర్తిగా దమనమైంది. ఈ ఘటనపై ఆంబూరు రూరల్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.



కారులో చెలరేగిన మంటలు

రూ.4,620 కోట్ల మోసం కేసులో హిజావు డైరెక్టర్‌కు బెయిలు నిరాకరణ

ప్యారీస్, ఆగస్టు 22: చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న హిజావు ఫైనాన్స్ సంస్థ డైరెక్టర్లలో ఒకరైన కలైసెల్వి బెయిలు పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు మూడో సారి కూడా తోసిపుచ్చింది. హిజావు సంస్థలో చందాదారులుగా చేరితే 15 శాతం వడ్డీ ఇస్తానని ప్రకటించడంతో ప్రజలు సుమారు రూ.4,620 కోట్లు డిపాజిట్ చేశారు. ఈ నగదు మొత్తాన్ని స్వాహా చేసినట్లు బాధితులు అందజేసిన ఫిర్యాదును ఆర్థిక నేర విభాగం కేసు నమోదు చేసి మొత్తం 14 మందిని అరెస్ట్ చేసింది. ఈ కేసులో ఫైనాన్స్ సంస్థ డైరెక్టర్ అలెగ్జాండర్ సహా 15 మంది అజ్ఞాతంలోకి వెళ్లగా, వారికి వ్యతిరేకంగా లుక్ ఔట్ నోటీసు జారీచేశారు. ఇదిలా ఉండగా, ఈ సంస్థ డైరెక్టర్లలో ఒకరైన కలైసెల్వి తన భర్త రవిచంద్రన్ పేరుతో ఆర్ఎంకే బ్రదర్స్ పేరుతో సంస్థ నిర్వహించి హిజావు సంస్థ కోసం పెట్టుబడులు రాబట్టుకొని మోసం చేసినందుకుగాను ఏప్రిల్ మొదటి వారంలో అరెస్టయ్యారు. ఈ కేసు నుంచి బెయిలు కోరుతూ ఆమె మూడో సారి పెట్టుకున్న పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి కె.ఇలంద్రియన్ తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేశారు.

పోక్సో చట్టం కింద టీచర్ అరెస్ట్

ప్యారీస్, ఆగస్టు 22: కోయంబత్తూర్ సమీపంలో 9 మంది విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన పాఠశాల టీచర్‌ను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. మేట్టుపాళయం సమీపంలోనిఒ పాఠశాలలో జిల్లా పిల్లల సంరక్షణ విభాగం అధికారి హప్సా నేతృత్వంలో అత్యాచారం, లైంగిక వేధింపులకు సంబంధించిన అవగాహన కార్యక్రమం జరిగింది. ఆ సందర్భంగా ఆ పాఠశాలలో 7,8,9 తరగతి విద్యార్థినులు 9 మంది ఆ పాఠశాల టీచర్‌గా పనిచేస్తున్న నటరాజన్ (54) తమపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదుచేశారు. దీనిపై జరిపిన విచారణలో... వాస్తవాలు వెలుగులోకి రావడంతో హప్సా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో, రంగంలో దిగిన పోలీసులు, విచారణ జరిపి నటరాజన్‌ను పోక్సో చట్టం కింద బుధవారం అరెస్ట్ చేశారు.

కళాసుధ ఆధ్వర్యంలో

26న కృష్ణాష్టమి వేడుకలు

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీన శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు జరుగనున్నాయి. రాయపేట టీటీకే రోడ్డులో వున్న మ్యూజిక్ కాడమీలో సాయంత్రం 5 గంటలకు ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, ప్రత్యేక అతిథులుగా ప్రముఖ నేపథ్యగాయని పి.సుశీల, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు ఆచార్య సీఎంకే రెడ్డి, మాజీ డీజీపీ ఆర్.శేఖర్, సినీ నిర్మాత ఏఎం రత్నం, ఆస్కా అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారెడ్డి హాజరుకానున్నారు. శ్రీ కళాసుధ వ్యవస్థాపక అధ్యక్షులు బేతిరెడ్డి శ్రీనివాస్ స్వాగతోపన్యాసం చేయనుండగా, పి.మోహన్‌కుమార్‌గాంధీ సభ నిర్వహించనున్నారు. క్రెడాయ్ మహిళా విభాగ అధ్యక్షురాలు పద్మ దేవదాస్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారరంభమయ్యే ఈ కార్యక్రమంలో భాగంగా ఎస్ఆర్ఎం ఛైర్మన్ డాక్టర్ రవి పచ్చముత్తు, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌లకు 'సేవారత్న' పురస్కారం, టీఎస్ సంగీత నాటక అకాడమీ ఛైర్‌పర్సన్ డాక్టర్ అలేఖ్య పుంజాలకు 'నాట్య కళాసుధ-నాయిని కృష్ణమూర్తి' పురస్కారం, వీణా విద్వాంసురాలు వీణశ్రీవాణికి 'సంగీత సుధ సరస్వతి' పురస్కారం, 'సూపర్ స్టార్ సింగర్-3' ఆవిర్భవ్‌కు 'బాల గానగంధర్వ' పురస్కారం ప్రదానం చేయనున్నారు. ఇదిలా వుండగా ఈ వేడుకలకు హాజరయ్యే ప్రతి కుటుంబానికి 'శ్రీకృష్ణుడి వెండినాణెం బహుమతిగా ఇవ్వబడునని కళాసుధ అధ్యక్షులు బేతిరెడ్డి శ్రీనివాస్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

ఇకపై రెండు మీటర్లకు ఒకే బిల్లు

ఐసిఎఫ్, ఆగస్టు 22: ఒక దుకాణంలో రెండు విద్యుత్ కనెక్షన్లుంటే వాటిని సమన్వయపరచి ఒకే బిల్లు వసూలుచేసేలా చర్యలు చేపట్టినట్లు విద్యుత్ బోర్డు తెలిపింది. రాష్ట్ర విద్యుత్ బోర్డు గృహాలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తోంది. ఒక ఇల్లు, ఒక దుకాణానికి ఒక కనెక్షన్ మాత్రమే ఇస్తుండగా, కొందరు అదనపు బిల్లు నుంచి తప్పించుకునేందుకు అక్రమంగా రెండు, మూడు విద్యుత్ కనెక్షన్లు పొందుతున్నారు. దీంతో ఒక్కొక్క మీటరులో తక్కువ విద్యుత్ రీడింగ్ నమోదుకావడంతో దానికి తగ్గట్లు విద్యుత్ బిల్లు వస్తుంది. దీని ద్వారా విద్యుత్ బోర్డుకు నష్టం ఏర్పడుతుంది. ఈ నష్టాన్ని సరిచేసేలా ఇకపై రెండు, మూడు విద్యుత్ మీటర్లున్న దుకాణాలు, గృహాలు, వాణిజ్య సంస్థలను గుర్తించి ఒకే బిల్లు వసూలుచేయాలని ఇంజనీర్లకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.



మైలాడుదురై జిల్లాలో సీర్గాళికి సమీపంలోని ఆచ్చాళ్‌పురం శివలోక త్యాగేశ్వరస్వామి ఆలయం మోక్షప్రాప్తిని ప్రసాదించే శైవక్షేత్రంగా భాసిల్లుతోంది. ఆచ్చాళ్‌పురం పౌరాణిక నామధేయం తిరునల్లూరు పెరుమణం. శివభక్త శిఖామణులలో శ్రేష్ఠుడు, నాయన్మార్లలో అగ్రగణ్యులైన తిరుజ్ఞాన సంబంధర్ ముక్తిపొందిన దివ్యక్షేత్రమిది. ఓం నమఃశివాయ అనే పంచాక్షరీ మహిమలను, విభూతి ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాటే శైవక్షేత్రంగా ఈ ఆలయం ప్రఖ్యాతిగాంచింది. - ఆంధ్రజ్యోతి, చెన్నై



ఆలయ రాజగోపురం

ఆచ్చాళ్‌పురం

- పంచాక్షరీ, విభూతి మహిమలను చాటే ఆలయం
- జ్ఞానసంబంధర్‌కు ముక్తినిచ్చిన శివలోక త్యాగేశుడు

మోక్షాన్ని ప్రసాదించే శైవక్షేత్రం

ఆధ్యాత్మికం

స్థలపురాణం...

పదహారేళ్ల తిరుజ్ఞాన సంబంధర్‌కు వివాహం చేయాలని తల్లిదండ్రులు భావిస్తారు. అయితే తిరుజ్ఞాన సంబంధర్ వివాహం చేసుకోనని చెబుతారు. అయితే తల్లిదండ్రులతోపాటు బంధువులంతా కలిసి ఒత్తిడి చేయడంతో ఆయన వివాహానికి అంగీకరిస్తారు. అచ్చాళ్‌పురం అనే తిరునల్లూరు పెరుమణం క్షేత్రంలో నివసిస్తున్న నంబియాండార్ నంబి అనే సాధుపుంగవుడి కుమార్తె పూర్ణాంబికతో తిరుజ్ఞానసంబంధర్‌కు వివాహం జరిపేందుకు నిర్ణయించారు. వయ్యాసి మాసం మూలా నక్షత్ర ఘడియల్లో తిరునల్లూరు పెరుమణం క్షేత్రంలో తిరుజ్ఞానసంబంధర్, పూర్ణాంబిక వివాహం జరుగుతుంది. ఆ వివాహవేడుకల్లో భక్తులతో పాటు తిరునీలనక్క నాయనార్, తిరునీలకంఠ యాళ్‌ప్పాణర్, మురుగనాయనార్ తదితరులు కూడా వస్తారు. వేదపండితుడైన తిరునీలనక్క నాయనారే తిరుజ్ఞాన సంబంధర్ వివాహానికి పౌరోహిత్యం చేస్తారు. యాగగుండం వెలిగించగానే భక్తులంతా పంచాక్షరీ మంత్రాన్ని జపిస్తారు. తిరుజ్ఞాన సంబంధర్ వివాహం ముగిసింది. ఆ సమయంలో తిరుజ్ఞానసంబంధర్ 'కాదలాగి కసిందు కన్నీర్ మలగి' అంటూ తిరుప్పదికాన్ని గానం చేశారు. అదే ఆయన చివరగా గానం చేసిన తిరుప్పదికమైంది. ఆ తిరుప్పదిక్కంను ఆయన ముగించినప్పుడు ఆ ఆలయంలో కొలువైన పార్వతీదేవి నడచివచ్చి, విభూతి నిచ్చి, దానిని నుదుట పెట్టుకుంటే అందరికీ జన్మరాహిత్యం ప్రాప్తిస్తుందని ప్రకటించింది. అది విని పలువురు బ్రతుకుమీది తీపితో అక్కడి నుంచి పారిపోతారు.ఆ విభూతిని నుదుట రాసుకున్నవారంతా ముక్తి నొందుతారు. ఆలయంలోని గర్భాలయంలో పరమేశ్వరుడు జ్యోతిస్వరూపుడిగా మారటంతో, తిరుజ్ఞానసంబంధర్, తనతోపాటు ఉన్న సాధుపుంగవులు, సామాన్యులను పిలిచి ఆ జ్యోతిలో లీనమవుదాం రండి అంటూ ఆహ్వానిస్తారు.తిరుజ్ఞానసంబంధర్ తన సతీమణి చేయి పట్టుకుని 'నమఃశివాయ వాళ్‌గ' అంటూ స్తుతిస్తూ, ఆ జ్యోతిలో ఐక్యమవుతారు. ఆయనతోపాటు మునులు, సాధువులు కూడా లీనమై మోక్షాన్ని పొందుతారు. ఆ జ్యోతిని చూసి పారిపోయినవారందరూ మోక్షానికి దూరమై లౌకిక జీవితంలో కష్టాలను అనుభవిస్తారు. నేటికీ శైవ సిద్ధాంతాల కీర్తి ప్రతిష్ఠతలు వెలుగొందుతుండటానికి తిరుజ్ఞానసంబంధర్ కారణమనటం అతిశయోక్తి కాదు. తాను జీవించిన 16 యేళ్లలో 13 యేళ్లను శైవమత వ్యాప్తికోసమే కృషి చేశారు. తిరుజ్ఞాన సంబంధర్ అవతార క్షేత్రమైన సీర్గాళి సట్టైనాదర్ ఆలయం, ముక్తిస్థలమైన అచ్చాళ్‌పురం శివలోకనాధర్ ఆలయం ధరుమై ఆధీనంలో ఉన్నాయి. ఈ రెండు ఆలయాల్లోనూ సంబంధర్‌కు అర్చనలు చేయడం ఆనవాయితీ.



పంచాక్షర తీర్థం

శివలోక త్యాగేశర్...

ఈ ఆలయంలో సంబంధర్, ఎంతోమంది మునులు, సాధువులు మోక్షం పొందటంతో ఇక్కడి స్వామివారిని 'శివలోక త్యాగేశర్' అని పిలుస్తున్నారు. ఆయనను 'పెరుమణముడయ మహాదేవర్' (పెద్ద మనస్సు కలిగిన మహాదేవుడు) అని కూడా పిలుస్తారు. పార్వతీదేవి స్వయంగా వచ్చి విభూతిని ప్రసాదించడంతో ఇక్కడి అంబికాదేవికి 'వెన్నీరూట్రు ఉమయమ్మై' అనే పేరొచ్చింది. ఈమెకు 'వెన్నీరూట్రు ఉమై నంగై' 'శ్వేత విభూతి నాయకి', 'విభూతి కళ్యాణి' అనే పేర్లు కూడా ఉన్నాయి. ఈ అమ్మవారి సన్నిధిలో కుంకుమకు బదులుగా విభూతి ప్రసాదంగా ఇస్తున్నారు. ఈ విభూతిని నుదుట రాసుకుంటే మగువలకు మాంగల్యభాగ్యం కలుగుతుందనేది ఐతిహ్యం.



వెన్నీరూట్రు ఉమయమ్మై

రుణ విమోచకుడు...

ఈ ఆలయంలో స్వామివారి సన్నిధి వెనుకవైపు రుణ విమోచకుడి సన్నిధి ఉంది. ఈ స్వామివారిని మొక్కితే రుణబాధలు తీరుతాయి. 11 సోమవారాలు ఈ స్వామివారికి అర్చన, అభిషేకం చేస్తే రుణబాధలు పూర్తిగా తొలగుతాయని, వ్యాపారాభివృద్ధి జరుగుతుందని శైవపండితులు చెబుతున్నారు.

పంచాక్షర తీర్థం...

ఇటు పంచాక్షరీకి, అటు విభూతి మహిమలను చాటే శైవక్షేత్రంగా ఆచ్చాళ్‌పురం భాసిల్లుతోంది. పరమశివుడు తన శూలాయుధంతో ఇక్కడ తీర్థకొలను తవ్వి, అందులో తన శిరస్సుపై ఉన్న గంగతో నింపారు. కనుకనే ఈ తీర్థకొలనును పంచాక్షర తీర్థం అని పిలుస్తున్నారు. ఈ తీర్థకొలనులో వయ్యాసి, ఐప్పసి, కార్తీగై, మాసి మాసాల్లో స్నానమాచరిస్తే పలు యాగాలు చేసినంత ఫలం దక్కుతుంది. అంతేకాకుండా జ్ఞానం, ధనమూ ప్రాప్తిస్తాయి. రోగ విముక్తులవుతారు.




వెన్నీరూట్రు ఉమయమ్మై సన్నిధి

ఎలావెళ్ళాలి?

రాష్ట్ర రవాణాసంస్థ లేదా ప్రైవేటు బస్సుల్లో చిదంబరం నగరానికి గాని సీర్గాళికి గాని వెళ్ళి అక్కడినుండి టౌన్ బస్సులు, ఆటోలు, టాక్సీల్లో చిదంబరం - సీర్గాళి రహదారిలోని కొళ్లిడం ఫ్లైఓవర్ దాటితే కొళ్లిడం చేరుకుంటారు. అక్కడి నుండి 5 కి.మీల దూరంలోని ఆచ్చాళ్‌పురం ఆలయానికి చేరవచ్చు. సీర్గాళి నుంచి 16 కి.మీల దూరంలో ఈ ఆలయం ఉంది. చిదంబరం, సీర్గాళి నుండి ఆచ్చాళ్‌పురం వెళ్లేందుకు సిటీ బస్సులు కూడా ఉన్నాయి. ఈ ఆలయాన్ని రోజూ ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, సాయంత్రం 4.30 నుండి రాత్రి 8 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

కాకమునికి మోక్షం...


కాశీలో తపమాచరించిన కాకమునికి పరమేశ్వరుడు సాక్షాత్కరించారు.. కాకముని తనకు ముక్తిని ప్రసాదించమని వేడుకున్నారు. పరమేశ్వరుడు కాశీలోని గంగానదిలో మునగమని ఆదేశిస్తారు. ఆ ప్రకారమే గంగానదిలో మునిగిన కాకముని ఆచ్చాళ్‌పురం ఆలయం వద్దనున్న తీర్థకొలనులో తేలారు. అందుకే ఆ తీర్థం 'గంగాకూపం' (కాశి బావి)గా పేరొందింది. ఆచ్చాళ్‌పురం తీర్థంలో తేలిన కాకమునీశ్వరుడి ఎదుట ఉన్న అన్ని వస్తువులు శివలింగ రూపంలోనే కనిపించడంతో ఆ మహర్షి శీర్షాసనం ద్వారా ఆచ్చాళ్‌పురం స్వామి త్యాగేశుడిని ఆరాధించారు. ఆ సమయంలో నైరుతి దిశకు వెళ్ళి అక్కడే ఉండమని, కొద్ది రోజుల తర్వాత జ్ఞానసంబంధర్ కూడా ఆ ప్రాంతానికివస్తారని, ఆ తర్వాత ముక్తి లభిస్తుందని అశరీరవాణి వినిపిస్తుంది. ఆ ప్రకారమే కాకముని తీర్థం నిర్మించుకుని స్వామివారిని ఆరాధించారు. అశరీరవాణి చెప్పినట్టే తిరుజ్ఞాన సంబంధర్ వివాహమాడేందుకు ఈ క్షేత్రానికి రావటం, ఆ తర్వాత ఆయనతోపాటు కాకమునీశ్వరుడు కూడా ముక్తినొందుతారు.



ఆలయ అంతర ప్రాకారం



శివలోక త్యాగేశుడు



అమ్మవారి గర్భాలయ గోపురం

ఆలయ వైభవం..

ఈ ఆలయం తూర్పుదిశగా ఐదంతస్థుల రాజగోపురంతో నిర్మితమై ఉంది. ఆలయంలోని ఏకాదశ (11) తీర్థాల్లో ఒకటైన పంచాక్షర తీర్థం ఆలయానికి ఎదురుగా ఉంది. రాజగోపురం గుండా లోపలకు వెళ్తే ఎత్తయిన రాజగోపురం, నందిమండపం, శతస్తంభ మండపం దర్శనమిస్తాయి. ఆ మండపంలో తిరుజ్ఞానసంబంధర్, తన భార్య పూర్ణాంబికై సమేతుడై ప్రత్యేక సన్నిధి పూజలందుకుంటున్నారు. ఆ తర్వాత తూర్పుదిశగా శివలోక త్యాగేశుడు భక్తులకు దర్శనమిస్తున్నారు. గర్భాలయ గోష్ఠ మూర్తులుగా వినాయకుడు, దక్షిణామూర్తి, బ్రహ్మ, దుర్గాదేవి దర్శనమిస్తారు. స్వామివారి సన్నిధి ద్వారంలో పైభాగాన రంగుల సున్నంతో తయారైన తిరుజ్ఞాన సంబంధం జ్యోతిలో లీనమైన ఆకారాలున్నాయి. పడమటి వైపు ప్రహరీలో రుణ విమోచనర్ సన్నిధి, తర్వాత మహాలక్ష్మి సన్నిధి ఉన్నాయి. తిరువెన్నీరూట్రు ఉమయమ్మై (ఉమాదేవి)కి ప్రత్యేక మందిరం ఉంది. ప్రతియేటా వయ్యాసి మూల నక్షత్ర దినాన ఈ ఆలయంలో సంబంధర్ వివాహ వేడుకలు, సంబంధర్ జ్యోతిలో ఐక్యమయ్యే వైభవం ఘనంగా జరుగుతాయి. సాధారణంగా ఏ ఆలయంలోనూ ఉత్సవమూర్తిని గర్భాలయంలోకి తీసుకెళ్లరు. అయితే ఈ ఆలయంలో తిరుజ్ఞాన సంబంధర్ వివాహం జరిగిన తర్వాత సంబంధర్ ఉత్సవమూర్తిని గర్భాలయంలోకి తీసుకెళ్ళి మూలవిరాట్టు పాదంపై ఉంచుతారు. ఆ తరువాత కర్పూరం వెలిగించి దీపారాధన చేస్తారు. ఆ సమయంలోనే సంబంధర్ జ్యోతిలో లీనమవుతారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ దృశ్యాన్ని చూసే వారికి జన్మరాహిత్యం ప్రాప్తిస్తుందని శైవపండితులు చెబుతున్నారు.

విపత్తులపై అప్రమత్తత కోసం... అత్యవసర కార్యకలాపాల కేంద్రం

- ప్రారంభించిన సీఎం స్టాలిన్

ప్యారీస్, ఆగస్టు 22: స్థానిక ట్రిప్లికేన్ నియోజకవర్గ పరిధిలోని ఎళిలగంలో రెవెన్యూ, విపత్తు నిర్వహణ ఆధ్వర్యంలో రూ.5.12 కోట్లతో పునరుద్ధరించిన స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్స్ సెంటర్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రం వర్షం, తుఫాను, వరదలు, కొండ చరియలు విరిగి పడడం, భూకంపాలకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్లు, ఇతర విపత్తు నిర్వహణ విభాగాలు, ముఖ్యంగా ప్రజలు, మీడియాకు ఎప్పటికప్పుడు అందిస్తుంది. అంతేకాకుండా, విపత్తుల సంసిద్ధత, విపత్తుల సమయంలో రెస్క్యూ, రిలీఫ్ పనులపై మంత్రులు, వివిధ ప్రభుత్వ శాఖల సీనియర్ అధికారులతో సంప్రదించేందుకు అనుకూలంగా ఈ కేంద్రం 24 గంటలు పనిచేయనుంది. అత్యాధునిక టెక్నాలజీతో నిర్మితమైన ఈ కేంద్రంలో 70 సీట్లతో కాన్ఫరెన్స్ హాలు, ప్రజలు ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నెంబర్లు 1070, 112తో పనిచేసే విభాగాలు, డిజాస్టర్ టెక్నాలజీ యూనిట్, రెస్క్యూ, రిలీఫ్ పనులు వేగవంతం చేయడానికి 48 విభాగాల అధికారులు పాల్గొనే మల్టీ డిసిప్లనరీ కో-ఆర్డినేషన్ విభాగంతో పాటు ఈ కేంద్రంలో పనిచేసే ఉద్యోగుల కోసం క్యాంటీన్, విశ్రాంతి గది తదితర సౌకర్యాలు కూడా కల్పించారు. ఈ కేంద్రాన్ని ప్రారంభించి, సందర్శించిన సీఎం స్టాలిన్‌కు సంబంధిత ఉన్నతాధికారులు అందులో ఉన్న విశేషాలు వివరించారు.



స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీఎం

ఘనంగా 'మద్రాసు డే' వేడుకలు

పెరంబూర్, ఆగస్టు 22: పసుమై తాయగం ఆధ్వర్యంలో 385వ మద్రాసు డే వేడుకలు ఘనంగా నిర్వహించారు.పల్లవన్‌తాంగల్ బస్టాండ్ సమీపంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి పల్లవన్‌తాంగల్ మాజీ సర్పంచ్ ఏఎన్‌ఈ దక్షణామూర్తి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పసుమై తాయగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి లయన్ ఎన్.కన్నన్ పాల్గొని, చెన్నప్ప నాయకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఎంకే జిల్లా కార్యదర్శి హరికృష్ణన్, జిల్లా అధ్యక్షులు కొరుగై మనోహరన్, పసుమై తాయగం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా ప్రిసీడియం కార్యదర్శి అరవింద్‌రాజ్, పీఎంకే శాఖా కార్యదర్శి టి.మహేష్, నిర్వాహకులు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. వేడుకల్లో భాగంగా ప్రజలకు స్వీట్లు పంపిణీ చేయడంతో పాటు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



చెన్నప్ప నాయకర్ చిత్రపటానికి పూలు చల్లి నివాళులర్పిస్తున్న అతిథులు, నిర్వాహకులు

రూ. 1000 కోట్లతో రామ్‌రాజ్ విస్తరణ



యూనిట్లను ప్రారంభిస్తున్న సీఎం

- తిరుప్పూర్, ఈరోడ్డులో కొత్త యూనిట్లు
- మరో 7 వేల మందికి ఉపాధి

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వస్త్రరంగంలో ప్రసిద్ధి చెందిన 'రామ్‌రాజ్' కాటన్ సంస్థ విస్తరణ కొనసాగుతూనే వుంది. రూ.1000 కోట్లతో తిరుప్పూర్ జిల్లా ఉడుమలపేట్టై, ఈరోడ్డు జిల్లా పెరుందురై సిప్కాట్‌లో ఆ సంస్థ మరో రెండు యూనిట్లను ప్రారంభించింది. బుధవారం చెన్నైలో జరిగిన పెట్టుబడుల సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా యూనిట్లను లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రామ్‌రాజ్ చైర్మన్ కేఆర్ నాగరాజన్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా తదితరులు పాల్గొన్నారు. కాగా కొత్త కర్మాగారాల వల్ల 2 వేల మందికి ప్రత్యక్షంగానూ, 5 వేల మందికి పరోక్షంగానూ ఉపాధి లభిస్తుందని రామ్‌రాజ్ సంస్థ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

ఆర్‌సీఎస్‌ఈడీతో 'సవీత' ఒప్పందం

చెన్నై, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సవీత డెంటల్ కాలేజ్ యూకేలోని రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఎడిన్‌బర్గ్ (ఆర్‌సీఎస్‌ఈడీ)తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. దీని వల్ల చెన్నైలోని ప్రతిష్ఠాత్మకమైన డెంటల్ సర్జరీలు నిర్వహించేందుకు ఆర్‌సీఎస్‌ఈ ద్వారా గుర్తింపు పొందిన భారత్‌లో మొదటి కేంద్రంగా సవీత డెంటల్ కాలేజీ వుంటుందని, తద్వారా దేశంతో పాటు పొరుగు దేశాల్లోని విద్యార్థులకు గణనీయంగా ప్రయోజనం చేకూరుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఎస్‌ఈడీ ప్రతినిధులు డాక్టర్ గ్రాంట్ మెక్ ఇంటైర్, డాక్టర్ విలియం, సవీత డెంటల్ కాలేజీ ప్రతినిధులు డాక్టర్ ఎన్ఎం వీరయ్యన్ తదితరులు కూడా పాల్గొన్నారు.



ఒప్పంద కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు

చిత్రజ్యోతి

'హింస' అనే రంగు ఎందుకు పులుముతున్నారు?

- దర్శకుడు మారిసెల్వరాజ్

తాను రూపొందించే చిత్రాలకు 'హింస' అనే రంగు ఎందుకు పులుముతున్నారని సినీ దర్శకుడు మారి సెల్వరాజ్ ప్రశ్నించారు. ఆయన తాజాగా దర్శకత్వం వహించిన చిత్రం 'వాళై' శుక్రవారం విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని, సినీ ప్రముఖులకు, సినిమా పాత్రికేయులకు ఈ సినిమా ప్రత్యేక షో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, 'సామాన్య ప్రజానీకానికి సంబంధించిన కథలను ఆవిష్కరించే సమయంలో వారిలోని కోపతాపాలను కూడా చూపించాల్సి ఉంది. ఇవి సమాజానికి వ్యతిరేకమైనవంటూ ఒక ముద్ర వేస్తున్నారు. ఈ కారణంగా ఒక దర్శకుడిగా స్వతంత్రంగా పనిచేయలేకపోతున్నా. పూర్తిగా నన్ను అర్థం చేసుకునేందుకు తీసిన చిత్రం ఇది. నా బాల్యంలో చోటుచేసుకున్న ఒక సంఘటనలనే ఈ సినిమా కథ. ఇందులోని క్లైమాక్స్ నా జీవితంలో మరిచిపోలేని ముఖ్య సన్నివేశం. ఆ సన్నివేశాన్ని చిత్రీకరించే సమయంలో తీవ్రమైన మానసిక సంఘర్షణకు లోనయ్యాను. బాల్యంలో నేను ఏం చూశానో అదే వెండితెరపై ఆవిష్కరించాను. నేను ఎవరు అని నిరూపించుకునేందుకు ఈ సినిమాను తెరకెక్కించాలని నిర్ణయించాను. నిజం చెప్పాలంటే ఈ కథనే నా తొలి చిత్రంగా తీయాలని భావించాను. కానీ, అపుడు సాధ్యపడలేదు. ఇప్పటికీ పూర్తయింది' అని వెల్లడించారు.



'వాళై'లో ఓ దృశ్యం

ఇకపై యేడాదికి 4 చిత్రాలు

- ప్రశాంత్



ఇకపై యేడాదికి నాలుగు చిత్రాల్లో నటించేలా ప్లాన్ చేస్తున్నట్టు టాప్‌స్టార్ ప్రశాంత్ తెలిపారు. ఆయన తాజాగా నటించిన 'అంధగన్' చిత్రం విజయంతో మరో సక్సెస్ తన ఖాతాలో వేసుకున్నారు. ఈ సినిమా సక్సెస్ వేడుకలను ఇటీవలే జరుపుకున్నారు. అలాగే, అగ్రహీరో విజయ్‌తో కలిసి 'ది గోట్' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా వచ్చే నెలలో విడుదలకానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన ఓ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, 'ఇక నుంచి ప్రతి యేటా కనీసం నాలుగు చిత్రాల్లో నటించేలా ప్లాన్ చేస్తున్నాం. కేవలం కొంతమంది దర్శకులతోనే కాకుండా పాత, కొత్త దర్శకులతో పనిచేసేందుకు ఇష్టపడుతున్నాను' అని ప్రశాంత్ పేర్కొన్నారు.

మంచి కథ చేజారడానికి నా తండ్రి కారణం కాదు

- శాంతను



'మహారాజ' వంటి ఓ మంచి కథ చేజారిపోవడానికి తన తండ్రి, సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్ కారణం కాదని హీరో శాంతను స్పష్టం చేశారు. ఈ స్టోరీని దర్శకుడు నితిలన్ స్వామినాథన్ ముందుగా తనకే వినిపించారనీ, ఈ కథను పలువురు నిర్మాతలకు వినిపించగా ఏ ఒక్కరూ సాహసం చేయలేదన్నారు. నితిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి నటించిన 'మహారాజ' చిత్రం సూపర్‌హిట్ కావడంతో పాటు రూ.100 కోట్లకు పైగా వసూళ్ళు సాధించింది. ఓటీటీలో విడుదలై ఉత్తర భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా మంచి ఆదరణ పొందుతూ, ఇప్పటికీ విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో ఒక మంచి సినిమాలో నటించే అవకాశాన్ని శాంతను కోల్పోయారంటూ ఆయన అభిమానులు సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేస్తున్నారు. వీటిపై హీరో శాంతను స్పందించారు. 'కథల ఎంపికలో నాన్న జోక్యం చేసుకోవడం లేదు. ఇప్పటివరకు నేను కరెక్టుగానే స్టోరీలను ఎంపిక చేసుకుంటున్నాను. 'మహారాజ' కథతో సినిమా తీసేందుకు ఏ ఒక్క నిర్మాత రిస్క్ చేయలేదు. అంతేకానీ నాన్న జోక్యం చేసుకోవడం వల్ల ఆ సినిమా చేజారిందన్న ప్రచారంలో వాస్తవం లేదు' అని శాంతను స్పష్టం చేశారు.

ఉత్తమ నటన అంటే బరువు సమస్య కాదు

- నిత్యామేనన్



ఉత్తమ నటన అంటే ఒక నటుడు లేదా నటి తన బరువు తగ్గించడమో, పెంచడమో, కృత్రిమ పద్ధతుల్లో బాడీ ట్రాన్స్‌ఫార్మింగ్ చేయడమో కాదని హీరోయిన్ నిత్యామేనన్ అన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అవార్డుల్లో ఉత్తమ నటి అవార్డు 'తిరుచిట్రాంబలం' సినిమాలో నటనకుగాను నిత్యామేనన్‌కు వరించింది. దీనిపై ఆమె స్పందిస్తూ, తనకు తొలి జాతీయ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ సినిమాలో చూసేందుకు నటన చాలా ఈజీగా ఉన్నట్టు ఉంటుంది. కానీ, ఆ నటన వెనుక ఎంతో శ్రమదాగివుందని, ఈ నటన అంత సులభమైనది కాదని జ్యూరీ సభ్యులు గుర్తించి అవార్డు ఇచ్చినందుకు ధన్యవాదాలు. ఉత్తమ నటన అంటే శరీర బరువు తగ్గించడం, పెంచడం, బాడీ ట్రాన్స్‌ఫార్మింగ్ కాదు. ఈ చర్యలు నటనలో ఒక భాగమేగానీ, అదే నటన కాదు. దీన్ని నిరూపించే ప్రయత్నంలో ఉన్నాను' అని వివరించారు.



చెన్నై సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా ఎంపికైన 158 మంది ఉద్యానవన శాఖ సహాయ అధికారులకు నియామక పత్రాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్. వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం, సీఎస్ మురుగానందం, వ్యవసాయ ఉత్పత్తి కమిషన్ అదనపు ప్రధాన కార్యదర్శి అపూర్వ, ఉద్యానవన, కొండ పంటల శాఖ డైరెక్టర్ కుమరవేల్ పాండ్యన్ తదితరులున్నారు.



సచివాలయంలో గురువారం ముఖ్యమంత్రి స్టాలిన్‌ని మర్యాదపూర్వకంగా కలుసుకున్న థాయ్‌లాండ్ నూతన దౌత్యాధికారి రచరిబర్గ్ (చిత్రంలో) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, థాయ్ ట్రేడ్ సెంటర్ డైరెక్టర్, కమర్షియల్ సెక్షన్ చెక్ జీనాపన్ తదితరులు



టి.నగర్‌లోని సీపీఎం ప్రధాన కార్యాలయంలో గురువారం ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.బాలకృష్ణన్‌ను కలిసి కరుణానిధి స్మారక నాణేం అందజేస్తున్న డీఎంకే అధికార ప్రతినిధి ఆర్ఎస్ భారతి, పార్టీ ప్రధాన కార్యాలయ కార్యదర్శి ఖాజా తదితరులు